సాక్షి
జనగామ

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024




భక్తులందరి చూపు చిలకలగుట్ట వైపే..
చర్చంతా మహోఘట్టం ఆవిష్కృతంపైనే..
వరాల తల్లిని తనివితీరా చూడాలనే ఆత్రుతే..
రెండు గంటలపాటు గుట్టపై రహస్య పూజలు
అంతలోనే డోలువాయిద్యాల చప్పుడు
క్రిష్ణయ్య చేతుల్లోకి అమ్మవారి ప్రతిరూపం
గుట్ట దిగుతుండగానే గాల్లోకి కాల్పులు
భక్తిపారవశ్యంతో ఊగిపోయిన భక్తజనం
దిక్కులన్నీ మార్మోగేలా జయహో సమ్మక్క నినాదాలు
దారిపొడవునా భక్తుల జయజయధ్వానాలు
ఆదివాసీల నృత్యాలు.. శివసత్తుల పూనకాలు
తల్లి గద్దె చేరేవరకు అదే ఉత్సాహం.. అదే భక్తి

న్యూస్‌రీల్

నేడు సెలవు

జనగామ రూరల్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర నేపథ్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు కలెక్టర్ శివలింగయ్య సెలవు ప్రకటించారు. మార్చి 9న వర్కింగ్ డేగా నిర్ణయించారు.

వనదేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా



తరిగొప్పుల/నర్మెట: తరిగొప్పుల మండలం బొంతగట్టునాగారం–బొత్తలపర్రె శివారు ఏడుపోచమ్మల, నర్మెట మండలం అమ్మాపురం సమ్మక్క–సారలమ్మ జాతరలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం సందర్శించారు. వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా నిలువెత్తు బంగారం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నగోని అరితాసుదర్శన్‌గౌడ్, జెడ్పీటీసీలు ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డి, మాలోత్ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, చింతకింది సురేష్, జాతర చైర్మన్ సభావత్ రాజు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్గో ద్వారా మేడారం బంగారం

జనగామ: మేడారం సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల బంగారం(బెల్లం) ప్రసాదం కోసం ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకోవచ్చని కార్గో ప్రతినిధి అవినాష్ తెలిపారు. జిల్లాకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న (ఆదివారం) సాయంత్రం వరకు మేడారం జనజాతర ప్రసాదం కోసం బుకింగ్ చేసుకోవచ్చన్నారు. జిల్లాకేంద్రానికి ఐదు కిలోమీటర్ల పరిధిలో బంగారాన్ని ఇంటింటికీ డెలివరీ చేయనున్నట్లు చెప్పారు. బుకింగ్ చేసుకున్న ఇతర ప్రాంతాల భక్తులకు ఫోన్‌చేసి బంగారం(ప్రసాదం) తీసుకువెళ్లాలని సమాచారం చేరవేస్తామన్నారు. అమ్మవార్ల ప్రసాదం అవసరమున్న భక్తులు 91542 98762, 96187 93458 నంబర్లకు ఫోన్‌చేసి రూ.299తో బుకింగ్ చేసుకోవాలన్నారు. ఇందులో రూ.150 దేవాదాయ శాఖ, మిగతా సొమ్ము ఆర్టీసీ సంస్థకు వెళ్తుందన్నారు.

24నుంచి పరీక్షలు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు గాను పరీక్షలు జరగనున్నాయని డీఈఓ కె.రాము, ఏసీజీఈ టి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24నుంచి 27వరకు పరీక్షలు కొనసాగుతాయని అన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే వారు పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రాలకు రావాలని సూచించారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షకేంద్రంలోని అనుమతించరని చెప్పారు.

ఆత్మవిశ్వాసంతో చదవాలి

● డీఈఓ రాము



తరిగొప్పుల: పదవ తరగతి పరీక్షలపై విద్యార్థులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆత్మవిశ్వాసంతో చదవాలని డీఈఓ రాము అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల ప్రత్యేకాధికారిని గోవిందు రజిత ఆధ్వర్యంలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ చంద్రభాను, రామరాజు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి పెన్‌నంబర్ ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: పాఠశాలల్లో చదివే ప్రతీ విద్యార్థికి పెన్ నంబర్(పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్) తప్పనిసరిగా ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రాన్ని డీఈఓ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ అన్ని రకాల యాజమాన్య పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పెన్ నంబర్ ఉండాలన్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ, పరీక్ష కేంద్రాల్లో సదుపాయాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ అధికారులు చంద్రభాను, రామరాజు, మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య, ఎమ్మార్సీ సిబ్బంది గిరి, సునీత, ప్రవీణ్, రామతులసి, లవన్, జ్యోతి, శ్రీలత, వెంకటేశ్వర్లు, రమేష్, అజయ్, మాషుక్ పాల్గొన్నారు.



సమ్మక్క ఆగమనం ఇలా..

- సాయంత్రం 6.51 గంటలకు చిలకలగుట్ట దిగే సమయాన స్వాగత సూచకంగా ఎస్పీ మొదటి రౌండ్ కాల్పులు
- 7.04 గంటలకు : గుట్ట ఎగ్జిట్ గేట్ లోపల రెండోసారి కాల్పులు
- 7.05గంటలకు : గేట్ దాటాక మరో రౌండ్ కాల్పులు
- 7.07 గంటలకు : మేడారానికి పయనం
- 8.50 గంటలకు : ఎదుర్కోళ్ల పూజా మందిరానికి చేరిక
- 9.10 పూజా మందిరం నుంచి గద్దె వైపు రాక
- 9.29 గంటలకు గద్దెపైకి చేరిన వనదేవత

సమ్మక్క తల్లిని చిలకలగుట్ట నుంచి తీసుకువస్తుండగా వడ్డెలు, పూజారులు, భక్తులు వెంట తరలివచ్చారు. పూనకాలతో శివసత్తులు ఊగిపోయారు. (ఇన్‌సెట్‌లో) గాల్లో కాల్పులు జరుపుతున్న ములుగు ఎస్పీ శబరీష్, వనదేవత రాకను కనులారా వీక్షించడానికి భక్తులు చెట్లు ఎక్కారు.

జయహో.. జగజ్జనని

మొక్కుల నడుమ గద్దెకు చేరిన సమ్మక్క..

చిలకలగుట్టపైకి వెళ్లింది ఐదుగురే..

- ఆదివాసీ సంప్రదాయాలతో ప్రత్యేక పూజలు
- అధికార లాంఛనాలతో గుట్ట దిగిన సమ్మక్క
- ధూపంతోనే ముందుకు సాగిన తల్లి
- మదిరగుడ్డలో కుంకుమభరిణె, బంగారు కడియాలు
- జిలకం నీళ్ల ఆరగింపుతో మేడారం వైపు పయనం
- దారిపొడవునా రంగవల్లికలు.. భక్తుల దండాలు కోళ్లు, మేకలను బలిస్తూ స్వాగతం
- అమ్మవారిని తాకేందుకు తీవ్ర ప్రయత్నాలు
- గద్దెపైకి చేరాక జాతరకు పరిపూర్ణత.. దర్శించుకుని భక్తుల తన్మయత్వం

మేడారం (ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి):

చిలకలగుట్టనుంచి సమ్మక్క తల్లి మేడారం గద్దెపైకి చేరడంతో మహాజాతర పరిపూర్ణత సంతరించుకుంది. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరడంతో భక్తుల మొక్కులు జోరందుకున్నాయి. గురువారం రాత్రి చిలకలగుట్టనుంచి పూజారులు, వడ్డెలు సమ్మక్కను భక్తుల జయజయ ధ్వానాల నడుమ తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. దారిపొడవునా డోలు వాయిద్యాలు, ఆదివాసీల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూనకాలతో శివసత్తులు ఊగిపోయారు. జై సమ్మక్క.. జైజైసమ్మక్క.. తల్లీ శరణు.. జయహో జగజ్జనని.. సల్లంగాచూడు తల్లి అంటూ భక్తుల నామస్మరణ మార్మోగింది.

గద్దెల వద్ద ప్రత్యేక పూజలు..

తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో ప్రధాన ఘట్టం సమ్మక్క ఆగమనం. తల్లిరాకతోనే జాతర సంపూర్ణమవుతుంది. కాగా, గురువారం మేడారంలోని సమ్మక్క గుడి శక్తిపీఠం వద్ద పూజారులు, వడ్డెలు సంప్రదాయ దుస్తులు ధరించి కుంకుమ, పసుపు, ఇతర పూజాసామగ్రిని పట్టుకొని గద్దెల వద్దకు చేరి ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజుకు పసుపు కుంకుమ అప్పగించిన తర్వాత పూజారులు చిలకలగుట్టకు చేరుకున్నారు.

వెళ్లింది వీరే..

సమ్మక్క కొలువై ఉన్న చిలకలగుట్టపైకి ఐదుగురు పూజారులు వెళ్లారు. ప్రధాన పూజారి సిద్ధబోయిన మునెందర్, జలకం వడ్డె మల్లెల ముత్తయ్య, ధూపం వడ్డె దోబె నాగేశ్వర్‌రావు, అమ్మవారిని తీసుకువచ్చే ప్రధాన వడ్డె కొక్కెర క్రిష్ణయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు వెళ్లారు. అవిరేణికుండలు, కుంకుమభరిణె, బంగారు కడియాలకు ఆదివాసీ సంప్రదాయబద్ధంగా రహస్య పూజలు చేశారు. క్రతువు పూర్తయ్యేవరకు అక్కడికి ఎవరిని అనుమతించలేదు. భారీపోలీసు బందోబస్తు మధ్య గుట్ట వద్ద రెండు గంటలు క్రతువు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండడానికి జనం మధ్యలోని గద్దెపైకి రావాలని అమ్మవారికి ఆహ్వానం పలికారు. అమ్మవారు కొన్ని షరతులు విధిస్తే వాటికి పూజారులు ఒప్పుకుని తల్లిని గద్దె మీదకు తీసుకొచ్చేందుకు మొక్కు చెల్లించారు. అమ్మవారిని తీసుకొచ్చి గుట్టకు వందమీటర్ల దూరంలో ఉన్న క్రిష్ణయ్యకు అప్పగించారు.

శక్తి ఆవహించి..

మదిరిగుడ్డ(ఎర్రవస్త్రం)లోని అమ్మవారి ప్రతిరూపాన్ని అప్పగించగానే క్రిష్ణయ్యను శక్తి ఆవహించి ఒక్కసారిగా ఊగిపోయాడు. పూజారులు సిద్ధబోయిన స్వామి, జనార్దన్, సిద్ధార్థ్, రమేష్ కొమ్ము ఊదగా డోలువాయిద్యాలు మోగించారు. అప్పటికే తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు 'జయహో సమ్మక్క... తల్లీ వందనం' అంటూ రెండు చేతులు జోడించి మొక్కారు. అక్కడి నుంచి సిద్ధబోయిన వంశీయులు, పూజారులు కలిసి అమ్మవారిని గుట్ట కిందకు తీసుకురాగానే ప్రభుత్వ లాంఛనాలతో గౌరవ వందనంగా ఏకే–47తో ములుగు ఎస్పీ శబరీశ్ గుట్టదిగే సమయంలో.. చిలకలగుట్ట గేట్ ముందు, గేట్ దాటాక (మొత్తం మూడు రౌండ్లు) గాల్లోకి కాల్పులు జరిపి స్వాగతం పలికారు.

రోప్‌పార్టీ, ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో..

పోలీసులు, ఆదివాసీ యూత్‌తో కూడిన నాలుగు అంచెల రోప్‌పార్టీ భద్రత నడుమ అమ్మవారు గద్దెపైకి బయలుదేరారు. తల్లి ఆగమనాన్ని తిలకించేందుకు వేలాదిమంది భక్తులు మేడారం గద్దెల నుంచి గుట్ట వరకు బారులుదీరారు. భక్తులు దారిలో రంగు రంగుల ముగ్గులు వేసి, కోళ్లు, మేకలను బలిచ్చి రక్తంతో స్వాగతం పలికారు. శివసత్తులు, భక్తులు పూనకంతో ఊగిపోయారు. భక్తులు అమ్మవారిని తాకేందుకు రోప్‌పార్టీ దాటే ప్రయత్నాలు చేశారు. ఆదివాసీ యూత్ సభ్యులను కూడా దాటి అమ్మవారిని తాకడానికి భక్తులు పోటీపడ్డారు. పూజారులు, వడ్డెలను తాకనివ్వకుండా ప్రతిఘటించి అమ్మవారిని తీసుకువచ్చారు.

ఎదుర్కోళ్లు.. మొక్కులు

చిలకలగుట్ట నుంచి మేడారం గద్దెకు వచ్చేదారి మధ్యలోని ఎదుర్కోళ్ల మండపానికి అమ్మవారిని తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న అర్రెం, పెనక వంశస్తులు.. సిద్ధబోయిన వంశస్తులకు వాయినాలు ఇచ్చారు. ఒకరిపై ఒకరు అక్షింతలు చల్లుకొని నోరు తీపిచేసుకొని బయలుదేరారు. అక్కడి నుంచి మేడారం గ్రామ ప్రధాన కూడలికి రాగానే స్థానిక ఆడపడుచులు అమ్మవారికి ఎదురెళ్లి మంగళహారతులతో నీళ్ల ఆరబోసి స్వాగతం పలికారు. చిలకలగుట్ట ప్రధాన దారి ఈశాన్యానికి తిరిగి మూడుసార్లు ఎడమ, కుడివైపు దండాలు పెట్టారు. ప్రధాన ద్వారం గుండా పగిడిద్దరాజు గద్దె వద్ద మూడుమార్లు ప్రదక్షిణలు చేశారు. అక్కడి నుంచి సమ్మక్కను గద్దెపైకి తీసుకువచ్చారు. అమ్మవారు రావడంతో విద్యుత్ లైట్లను పూర్తిగా నిలిపివేశారు. గద్దెపై ఏర్పాటు చేసిన కంకవనం వద్ద అమ్మవారి ప్రతిష్ఠ తంతు కనిపించకుండా చుట్టూ చీరలు కట్టారు. అనంతరం లైట్లను ఆన్ చేయడంతో భక్తులందరూ తల్లివైపు చూస్తూ జయజయధ్వానాలు పలికారు. అనంతరం పూజారులు గద్దె నుంచి మేడారంలోని సమ్మక్క గుడికి వెళ్లారు.



సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠించిన అనంతరం పసుపు, కుంకుమ చల్లుతున్న పూజారులు, ఆదివాసీ యూత్ సభ్యులు

ఒకేరోజు నలుగురు దేవరలు



గద్దెలపైకి ఒకేరోజు (గంటల వ్యవధిలో) నలుగురు దేవరలు చేరినట్లయ్యింది. బుధవారం రాత్రి 12.12 గంటలకు (అంటే గురువారం అయినట్లే) సారలమ్మ, ఆ తర్వాత కొద్దిసేపటికే గోవిందరాజులు, పగిడిద్దరాజు గద్దెలపైకి చేరారు. గురువారం రాత్రి 9.29 గంటలకు సమ్మక్క వచ్చింది. దీంతో తల్లీబిడ్డలతోపాటు మరో ఇద్దరు ఒకే రోజు వచ్చినట్లయ్యింది.



గురువారం రాత్రి వనదేవతలను దర్శించుకోవడానికి ఆవరణలో నిరీక్షిస్తున్న భక్తజనం



గద్దెల ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

జంపన్నవాగు ఏరియల్ వ్యూ



చిలకలగుట్ట జలం.. సర్వరోగాలు నయం..

మేడారం(ఏటూరునాగారం/ఎస్ఎస్‌తాడ్వాయి): మేడారంలోని చిలకలగుట్ట జలపాతం సర్వరోగ నివారిణిగా వెలుగొందుతోంది. జాతరలో ఎన్ని మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నప్పటికీ భక్తులు సమ్మక్క జలపాతం వద్దకు వచ్చి నీరును పట్టుకుంటున్నారు. అమ్మవారి జలపాతంగా స్వీకరిస్తున్నారు. చిలకలగుట్టలో ఉన్న వనమూలికల నుంచి జలం పారడంతో వాటిని పవిత్రంగా భావించి తమ ఇళ్లకు తీసుకెళ్తున్నారు. ఇంటి వద్ద భద్రతపర్చుకుని అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు తాగితే నయం అవుతుందని విశ్వసిస్తున్నారు.


చిలకలగుట్ట వద్ద నీరు పట్టుకుంటున్న భక్తులు

ఆరోగ్యానికి మంచిది



ఆరోగ్యానికి మంచిదని చిలకలగుట్ట నీటిని ఇంటికి తీసుకెళ్తున్నాం. గుట్టల్లో ఉన్న వనమూలికల పైనుంచి రావడంతో ఆ నీటిని తాగుతున్నాం. జాతరకు వచ్చిన మా ఊరివాళ్లు చెబితే ఈ నీటిని పట్టుకెళ్తున్నాం.

- స్వరూప, పాలకుర్తి

మోకాళ్ల నొప్పులు నయం



గత జాతరకు వచ్చినప్పుడు చిలకలగుట్ట నీటిని తాగా. దీంతో మోకాళ్ల నొప్పులు నయమయ్యాయి. అందుకే ఇప్పుడు కూడా నీటిని పట్టుకెళ్తున్నాం. నాతోపాటు నా పిల్లలు కూడా తాగుతారు.

- కుంజర్ల దుర్గ, మిర్యాలగూడ

ఆర్టీసీ బస్సుల్లో అమ్మల చెంతకు..

- ఇప్పటి వరకు మేడారం తరలిన 2.64 లక్షల మంది భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి : ఆర్టీసీ బస్సుల్లో మేడారం జాతరకు 2,64,808 మంది భక్తులను తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు 925 బస్ సర్వీస్‌ల్లో 2,64,808 మంది ప్రయాణించినట్లు వివరించారు. కాగా, గురువారం ఒకే రోజు 53,007 మందిని మేడారం తరలించినట్లు పేర్కొన్నారు.

కోడి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు




జంపన్న వాగులో మహిళల కేరింత


మేడారంలో భక్తజన సందోహం

మేడారం.. జనారణ్యం

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం జనారణ్యమైంది. ఎటూ చూసినా ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసింది. బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులును గద్దెలపై ప్రతిష్ఠించగా, గురువారం రాత్రి చిలకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకురావడంతో జాతర సంపూర్ణమైంది. సమ్మక్కను గద్దెలపైకి తీసుకొస్తున్న క్రమంలో భక్తులు తల్లికి ప్రణమిల్లారు. జై సమ్మక్క.. జైజై సమ్మక్క అంటూ తల్లి నామం స్మరిస్తూ అడవిని దద్దరిల్లించారు. అంతకుముందు భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని తల్లులకు పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తుబెల్లం సమర్పించి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. సమీప అటవీప్రాంతాల్లో సహపంక్తి భోజనాలు చేశారు.








నృత్యం చేస్తున్న మహిళలు

ట్రాఫిక్ జాం.. భక్తుల ఆగం

హరితహోటల్ జంక్షన్ వద్ద గంటపాటు స్తంభించిన జనసందోహం

మేడారం(ఎంజీఎం): మేడారం గురువారం జనసంద్రంగా మారింది. గద్దెల నుంచి జంపన్నవాగు వెళ్లేదారిలో హరితహోటల్ జంక్షన్ వద్ద రెండు వైద్యారోగ్యశాఖ అంబులెన్స్‌లు రావడంతో జనసందోహం స్తంభించింది. సుమారు ఆర కిలోమీటరు మేర ట్రాఫిక్ జాం అయ్యింది. ఈ క్రమంలో సెట్ల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, ఎస్పీ గాష్ ఆలం స్వయంగా ప్రదేశానికి చేరుకొని ట్రాఫిక్ మళ్లించారు. భక్తులను పొలాల ద్వారా జంపన్నవాగుకు పంపించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.


స్తంభించిన ట్రాఫిక్

రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్‌రెడ్డి పూజలు

- ఏపీ చీఫ్ విప్ రామకృష్ణారెడ్డి కూడా..

మేడారం(వరంగల్): ఉమ్మడి వరంగల్ జిల్లాకు కలెక్టర్‌గా పనిచేసిన విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ చీఫ్ విప్ రామకృష్ణారెడ్డి గురువారం అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందు తల్లులకు తులాభారం సమర్పించి, అనంతరం అమ్మవార్ల గద్దెకు చేరుకొని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ జాతరకు తప్పకుండా తల్లుల దర్శనానికి వస్తామన్నారు. అమ్మవార్ల శక్తి మహిమాన్వితమైందని తెలిపారు. అమ్మవారి దీవెనల కోసం దేశం నుంచి వివిధ రాష్ట్రాల ప్రజలు మేడారానికి రావడమే ఇందుకు నిదర్శనమన్నారు.



మత్తెక్కాలంటే జేబుకు చిల్లు పడాల్సిందే..

వరంగల్ చౌరస్తా : మేడారం మహాజాతరలో మత్తుక్కాలంటే జేబుకు చిల్లు పడుతోంది. చిరువ్యాపారులు ఎమ్మార్పీ కంటే అదనంగా కనీసం 50 శాతం ధరలు పెంచుతూ మద్యం విక్రయిస్తున్నారు. వైన్స్ అందుబాటులో లేకపోవడంతో చిరువ్యాపారుల ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారుతోంది. దీంతో మద్యం కోసం భక్తులు అడిగినంత ధర చెల్లిస్తున్నారు. కాగా, ఇవేమి ధరలంటూ చాలా మంది భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


చిరువ్యాపారుల దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యం

అక్కున చేర్చుకుని.. అప్పగించి

మేడారం(కన్నాయిగూడెం) : మేడారం మహాజాతరలోని గిరిజన మ్యూజియం సమీపంలో ఓ బాలుడు తప్పిపోయాడు. తల్లిదండ్రుల కోసం రోదిస్తుండగా అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు గమనించి బాలుడిని తీసుకెళ్లి జీపీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో అప్పగించారు.


బాలుడిని శిబిరానికి తరలిస్తున్న పోలీసులు

కొండెక్కిన కోడి..

- ఒక్కొక్కటి రూ.250 నుంచి రూ.450

వరంగల్ అర్బన్: మేడారం జాతరలో కోడి మొక్కులు తీర్చుకునే భక్తులు పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్నారు. ఒక్కొక్క బ్రాయిలర్ కోడిని తూకంతో సంబంధం లేకుండా రూ.350 నుంచి రూ.420 వరకు విక్రయిస్తున్నారు. లేయర్ (జుట్టు) కోళ్లు రూ.220 నుంచి రూ. 250 వరకు విక్రయిస్తున్నారు. ధర ఎక్కువైనా అమ్మవార్ల మొక్కుల కోసం భక్తులు అడిగినంత సొమ్ము చెల్లించి కొనుగోళ్లు చేయడం కనిపించింది.


కోళ్ల దుకాణం ఎదుట భక్తులు

స్పందించి.. తరలించి



మేడారం (వరంగల్): మేడారం మహాజాతరలో 108 సిబ్బంది సత్వరమే స్పందించి క్షతగాత్రుడికి వైద్య సేవలందించారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలకు చెందిన బుచ్చిరాములు గద్దెలకు వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న 108 జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శివకుమార్ తానే స్వయంగా క్షతగాత్రుడిని వైద్య శిబిరానికి తరలించారు.

కరెన్సీ కష్టాలు..

- పత్తాలేని మొబైల్ ఏటీఎంలు

వరంగల్ చౌరస్తా : మేడారంలో కరెన్సీ కోసం భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. మహా జాతరలో అణువణువు వెతికినా మొబైల్ ఏటీఎంల ఆచూకీ ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా ఇదే అదునుగా భావించిన కొంత మంది చిరు వ్యాపారులు కమీషన్ రూపంలో భక్తులకు అవసరమైన నగదును అందించారు. రూ. వెయ్యికి రూ. 50 నుంచి రూ. 100 వరకు అదనంగా వసూల్ చేశారు. దీనిపై భక్తులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.



జాతరలో చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన మినీ ఏటీఎం సెంటర్